

కాకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఘనంగా కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతి

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : కేంద్ర మంత్రిగా, ఎంపీగా సేవలందించిన దివంగత గడ్డం వెంకటస్వామి జయంతిని కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాజర్షిషా, అదనపు పాలనాధికారి శ్యామలదేవి, ఏవో రాంరెడ్డి, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

కష్టపడి చదివితే.. ఇష్టమైన జీవితం

కుటుంబ నేపథ్యం
- అమ్మ : కల్యాణి (గృహిణి)
- నాన్న : బి.ఎన్.సర్కార్ (విశ్రాంత ఐపీఎస్)
- భర్త : రోహిత్ ఝా (బ్యాంకు ఉన్నతోద్యోగి)
- స్వస్థలం : పాట్నా సమీపంలోని షోహసరి పట్టణం హబీబ్ పుర(బిహార్)
- అభిరుచి : చిత్రలేఖనం
- ఆటలు : వాలీబాల్ ఆడటం ఇష్టం



కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, న్యూస్‌టుడే : ఇలా చదువు పూర్తికాగానే అలా కొలువు రావాలని అందరూ కోరుకుంటారు. ఒకటి, రెండు ప్రయత్నాలు విఫలమైతే నిరాశ పడతారు. ఇక తమతో కాదులే అని నీరసిస్తారు. కొద్దిపాటి ప్రయత్నంతో ఏదో ఒకటి వచ్చింది చాలులే అని సరిపెట్టుకుంటారు. కానీ చాలా కొద్ది మంది మాత్రమే మొక్కవోని దీక్షతో అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ప్రయత్నించి విజయం దక్కించుకుంటారు. అందులో ఒకరు నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిలాష అభినవ్. కష్టపడి చదివితే ఇష్టమైన జీవితం పొందవచ్చంటున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే..

అమ్మ ప్రోత్సాహంతో..

కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్నా. పోటీ పరీక్షలు రాయడం.. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవడం అలవడింది. ఐఏఎస్ కావడానికి అమ్మా నాన్న ఎంతో ప్రోత్సహించారు. 'కల'గన్న ఐఏఎస్ నెరవేర్చుకున్నందుకు సంతోషంగా ఉన్నా. ఇది ఊరికే రాలేదు. చదువుకునే సమయంలో సరదాలకు దూరంగా ఉండి పుస్తకాలతో కుస్తీ పట్టా. కష్టమనిపించినా ఇష్టపడి చదవడంతో ఈ స్థానంలో ఉన్నా. ఇప్పుడు కలెక్టర్ హోదాలో ప్రజలకు అందిస్తున్న సేవలో ఆనందం కనిపిస్తుంది.

మానసికంగా దృఢంగా..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఒత్తిడికి లోనుకావొద్దు. నిబద్ధత, క్రమశిక్షణతో చదవాలి. చాలా మంది సివిల్స్ రాసేందుకు ఇష్టమున్నా కష్టమని వెనక్కి తగ్గుతుంటారు. సరైన ప్రణాళికతో ముందుకుసాగితే అనుకున్న లక్ష్యం సాధించవచ్చు. ప్రధానంగా మానసికంగా దృఢంగా ఉండాలి. అపజయాలు ఎదురైనా కుంగిపోవద్దు. చదువుతో భవిష్యత్తు ఉంటుందన్న సంకల్పం బలంగా ఉంటే విజయం వరిస్తుంది.

పాతికేళ్లలోపే లక్ష్యంవైపు..

పాతికేళ్లలోపు కచ్చితంగా లక్ష్యం వైపు అడుగులు పడాలి. ఈ దశలో ఏమి సాధించాలి. ఎటువైపు వెళ్లాలి అనే స్పష్టత ఉండాలి. మీ కల, లక్ష్యం సాధించడానికి వీలైనంత ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలి. ప్రయత్నంలో విఫలమైతే నిరాశ చెందొద్దు. సాధించాలనే సంకల్పం ఉండటం గొప్ప కాదు. దాన్ని అందుకునేవరకు పట్టుదల వీడొద్దు.

ప్రయాణం ఇలా..

- 2012లో బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) నవీ ముంబైలోని ఏపీ పటేల్ కళాశాలలో పూర్తి చేశా.
- పుణేలోని ఐబీఎంలో రెండున్నరేళ్లు ఉద్యోగం చేశాను. తర్వాత దిల్లీలోని సిండికేట్ బ్యాంకులో మేనేజరుగా పనిచేశా.
- 2014లో తొలిసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి విఫలమైనా నిరాశ చెందకుండా రెండో ప్రయత్నంలో 2016లో పట్టుదలతో చదివి 308 ర్యాంకు సాధించి ఐఆర్ఎస్(ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్)కు ఎంపికయ్యాను.
- నాగ్‌పూర్‌లో ఆదాయ పన్నుశాఖ అధికారిగా తొమ్మిది నెలలు పని చేశాను.
- 2017లో మూడోసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి జాతీయస్థాయిలో 18వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాను.
- శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆగస్టు 2020లో మొదటిసారిగా మహబూబాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా, తర్వాత ఖమ్మం అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు)గా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) జోనల్ కమిషనర్‌గా పనిచేశాను.
- ఇప్పుడు కలెక్టర్ తొలి పోస్టింగ్ నిర్మల్ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉంది.

గుట్టుగా.. అరల చాటున

● ఆదిలాబాద్ మీదుగా గంజాయి తరలింపు ● మూడేళ్లలో 1,500 కిలోల స్వాధీనం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి మహారాష్ట్రకు ఆదిలాబాద్ 44వ జాతీయ రహదారి మీదుగా గుట్టుగా భారీ స్థాయిలో గంజాయి రవాణా అవుతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రకు పకడ్బందీగా తరలిస్తున్నారు. అనుమానం రాకుండా ఉండటానికి మొక్కలు, కూరగాయలు తరలిస్తున్నట్లు వాటి అడుగున గంజాయి ప్యాకెట్లు పేర్చి రవాణా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కంటైనర్లలో అనుమానం రాకుండా ప్రత్యేక అరలు ఏర్పాటు చేసి తరలిస్తున్నారని ఒక పోలీసు అధికారి పేర్కొన్నారు.



ఇటీవల తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన 9 క్వింటాళ్ల గంజాయితో పోలీసులు

> ఆదిలాబాద్‌కు చెందిన 25 సంవత్సరాలలోపు వయసున్న స్నేహితులు కొందరు గంజాయి మత్తులో తాంసి మండలం మత్తడివాగు చెరువులో తనతో పాటు ఉన్న మిత్రుడిని నెట్టేసి చంపారు. అనంతరం అతడి ద్విచక్రవాహనాన్ని చోరీ చేసి మహారాష్ట్రలో విక్రయించారు.

> గాంధీపార్కు సమీపంలో రోడ్డుపై వెళ్తున్న యువకుడిని గంజాయి మత్తులో అటకాయించి కొందరు వివాదం సృష్టించారు. అతను తిరగబడటంతో కత్తితో దాడి చేయగా గాయాలపాలయ్యాడు. ఇలా అనునిత్యం ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

> గంజాయి మత్తులో పలు చోట్ల రాత్రుల్లో పలువురు గొడవపడి కత్తులతో పొడుచుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఖిల్లాకు చెందిన ఒక యువకుడిని కత్తితో పొడవగా తీవ్ర గాయాలపాలయ్యాడు.

రైలుమార్గంలో



మహారాష్ట్రకు తరలిన గంజాయిని అక్కడ వ్యాపారులు కిలోల చొప్పున ఆదిలాబాద్‌కు తరలిస్తున్నారు. పొడి గంజాయిని పొట్లాల రూపంలో ఇక్కడ విక్రయిస్తున్నారు. రైలులో నాందేడ్, కిన్వట్ ప్రాంతాల నుంచి ఆదిలాబాద్‌కు తరలించటం పరిపాటిగా మారింది. ఇక్కడ విడి విక్రయాలు చేసే వారు కొనుగోలు చేసి పలు కాలనీల్లో విక్రయిస్తున్నారు.



ఇచ్చోడ మండలంలోని వ్యవసాయ క్షేత్రంలో పండిస్తున్న గంజాయిని గుర్తించిన పోలీసులు

సంవత్సరం	కేసులు	నిందితులు	పట్టుకున్న గంజాయి(కిలోల్లో)	విలువ(రూ.లక్షల్లో)
2022	18	49	30.250	2.30
2023	29	67	291.00	67.68
2024	68	149	1,185	264.78

శివారు కాలనీల్లో విక్రయాలు

జిల్లా కేంద్రంలోని శివారు కాలనీల్లో రూ.50 నుంచి రూ.100కు ఒక పొట్లం(రెండు లేదా మూడు గ్రాములు) విక్రయిస్తున్నారు. సిగరెట్లకు అలవాటుపడ్డ యువత సరదాగా మత్తు కోసం గంజాయిని తాగడం ప్రారంభిస్తున్నారు. అనంతరం దానికి అలవాటు పడి గంజాయి లేనిదే ఉండలేకపోతున్నారు. దీంతో పలు రుగ్మతలకు, మానసిక వ్యాధుల బారిన పడి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

మారుమూల గ్రామాల్లో పంటల మాటున

పత్తి, తదితర పంటల మాటున జిల్లాలోని మారుమూల గ్రామాల్లో పలువురు గంజాయిని పండిస్తున్నారు. ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, నార్నూరు తదితర మండలాల్లో ఈ విధమైన సాగు కొనసాగుతోంది. పండించిన గంజాయిని స్థానికంగా కాకుండా మహారాష్ట్రకు తరలించి విక్రయిస్తున్నారు.

వాహనాలకు ఎస్కార్టు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి రవాణా చేసే వాహనాల ముందు కారు లేదా ఇతర వాహనాల ఎస్కార్టుతో ఆదిలాబాద్ సమీపంలోని మహారాష్ట్ర సరిహద్దును దాటిస్తున్నారు. ఎస్కార్టుగా ఉండే వాహనంలోని వ్యక్తులు రహదారిపై పోలీసుల తనిఖీలు ఉన్నాయా? తదితర అంశాలను పరిశీలిస్తూ ముందుకు వెళ్తుంటారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా గంజాయి తరలిస్తున్న వాహన డ్రైవర్‌కు సమాచారం అందించి వాహనాన్ని అక్కడే ఆపివేయటం లేదా వెనక్కి పంపించేయడం చేస్తుంటారు. గంజాయి తరలించే డ్రైవర్‌కు భారీగా డబ్బులు ముట్టజెబుతున్నారని సమాచారం.

ప్రారంభించి.. మూసేసి

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : సోయా కొనుగోళ్లను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. మరుసటి రోజు శనివారం కేంద్రాన్ని మూసేశారు. మార్కెట్లో క్వింటాలు ధర రూ.4,500 ఉంది. మద్దతు ధర కంటే తక్కువ ధర ఉండటంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ఆదిలాబాద్ మార్కెట్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ విషయమై మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డిని వివరణ కోరగా సోయాలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ఒకటి, రెండు రోజులు ఆరబెట్టుకొని తీసుకొని వస్తే.. రైతులకు మద్దతు ధర లభించే వీలుందని అన్నారు. సోమవారం నుంచి తిరిగి సోయాను కొనుగోలు చేస్తారని ఆయన అన్నారు.

తప్పుడు ధ్రువపత్రాల జారీపై విచారణ

● అధికారులను కదిలించిన 'ఈనాడు' కథనం

వందనం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : స్థానికత ఆధారంగా కేటాయించే ఉపాధ్యాయ పోస్టులను దొడ్డిదారిన దక్కించుకునేందుకు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన పలువురు అభ్యర్థుల బాగోతాన్ని బయటపెట్టిన 'ఈనాడు' కథనం అధికారులను కదిలించింది. ఆయా ధ్రువపత్రాలు జారీ చేసిన యాజమాన్యాలపై విచారణ జరపాలని నిర్ణయించారు. ఇందుకు ఎంఈవోలను విచారణ అధికారులుగా నియమించినట్లు డీఈవో ప్రణీత తెలిపారు. 'డీఎస్సీలో స్థానికత కలకలం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఉట్నూరుకు చెందిన ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల వారు ఇచ్చిన బోనఫైడ్ పత్రాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇందులో ఉట్నూరు పాఠశాలలో చదివిన అభ్యర్థిని ఏకంగా రెండు ధ్రువపత్రాలు సమర్పించి.. ఆ తర్వాత వెంట తీసుకొచ్చిన మరో పత్రాన్ని దరఖాస్తుకు జతచేయడంతో నకిలీ వ్యవహారం బయటపడింది. అప్రమత్తమైన యాజమాన్యం ఓ పార్టీకి చెందిన బడానేతను వెంటేసుకుని వచ్చి డీఈవోను కలిసి జరిగిన పొరపాటును ఒప్పుకున్నట్లు తెలిసింది. మరో విద్యార్థికి ఇవ్వాల్సిన బోనఫైడ్‌ను పొరపాటున డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థికి ఇచ్చినట్లు చెప్పి అసలు రిజిస్టరును చూపించినట్లు సమాచారం. డబ్బులు తీసుకుని ఇష్టారీతిన పాఠశాల యాజమాన్యాలు ధ్రువపత్రాలు జారీ చేస్తున్నాయని విద్యార్థి సంఘాల ఐకాస కన్వీనర్ రాహుల్ పేర్కొన్నారు. సంఘ సభ్యులతో కలిసి డీఈవోను కలిసి యాజమాన్యాలపై క్రిమినల్‌కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఈడబ్ల్యూఎస్ పత్రాల్లోనూ నకిలీలు

ధనిక వర్గాల్లోని పేదలకు ఇచ్చే ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలను కొందరు అనర్హులు దక్కించుకున్నట్లు అవకాశం కోల్పోయిన అభ్యర్థులు వాపోతున్నారు. వ్యవసాయ భూములు ఉండి అధిక ఆదాయం కలిగిన ధనికులు రెవెన్యూ కార్యాలయం నుంచి డబ్బులు ఇచ్చి ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు తీసుకుని ఆ కోటాలో డీఎస్సీకి ఎంపికైనట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఎంపికైన వారిలో ఒకరు ప్రభుత్వ కొలువు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ రాజర్షిషా, అదనపు పాలనాధికారి శ్యామలదేవి

రామ రామ రామ ఉయ్యాలో!

రామ రామ రామ ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ.. అంటూ విద్యార్థినులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ జాదవ్ గణేష్, అధ్యాపకులు విద్యార్థినులతో కలిసి ఆడి పాడారు. మెప్మా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాలనాధికారి రాజర్షిషా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ఇచ్చి అభినందించారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి, డీఆర్‌డీవో సాయన్న తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

ముగిసిన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

● 324 పోస్టులకు 666 మంది హాజరు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డైట్ కళాశాలలో నాలుగురోజులుగా కొనసాగుతున్న డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం ముగిసింది. డీఈవో ప్రణీత పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. జిల్లాలో 324 పోస్టులకుగాను 1:3 ప్రాతిపదికన ఆయా కేటగిరిలకు 760 మంది అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలవగా.. 666 మంది హాజరయ్యారు. ఇందులో 442 మంది ఎస్జీటీ అభ్యర్థులు, 190 మంది స్కూల్‌అసిస్టెంటు అభ్యర్థులు, 32 మంది భాషాపండిత అభ్యర్థులు, ముగ్గురు పీఈటీ అభ్యర్థులు ఉన్నారు. ఆయా ధ్రువపత్రాలు సమర్పించని 12 మంది అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించినట్లు డీఈవో తెలిపారు.

47 మందికి 103 పోస్టులు

డీఎస్సీలో 47 మంది అభ్యర్థులు రెండు, మూడు, నాలుగు పోస్టులకు ఎంపికయ్యారు. ఇందులో ఏ పోస్టు వస్తుందో తెలియక అన్నింటికి ధ్రువపత్రాల పరిశీలన చేయించుకున్నారు. మొత్తం 47 మందిలో ఒకరు నాలుగు పోస్టులకు, ముగ్గురు ఏడు పోస్టులకు, అత్యధికంగా 39 మంది రెండేసి పోస్టులను దక్కించుకున్నారు. పోస్టులన్నీ భర్తీ చేయాలనే ఉద్దేశంతో ఒక్కో పోస్టుకు 1:3 ప్రాతిపదికన అభ్యర్థులను పిలిచినా. . నాట్ విల్లింగ్ ఐచ్ఛికం లేకపోవడం.. పోస్టు వస్తుందనే గ్యారెంటీ లేకపోవడంతో 47 మంది 103 పోస్టులకు దరఖాస్తులు సమర్పించారు. వారంతా ఆయా పోస్టులకు ఎంపికైతే మిగిలిన అభ్యర్థులకు నష్టం జరుగుతుందని భావించిన విద్యాశాఖ శనివారం ఆయా అభ్యర్థులను పిలిచి పోస్టు కేటాయింపులో ఏ కేటగిరికి ప్రాధాన్యం ఇస్తారో అభ్యర్థన పత్రాలు తీసుకున్నారు.

ఇంద్రవెల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా నిర్మిస్తున్న ఇంటిని కూల్చివేసిన పంచాయతీ సిబ్బంది

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి మార్కెట్ యార్డు ఎదుట నాలాను ఆక్రమించుకొని ఇల్లు నిర్మించిన కాంబ్లె నాందేవ్ ఇంటిని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున కూల్చేశారు. 1/70 చట్టానికి విరుద్ధంగా వ్యవసాయ చేనులో ప్లాటు కొనుగోలు చేసి నిర్మిస్తున్న ఇంటిని సైతం కూలగొట్టారు. ఉట్నూరు సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బి.రమేష్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌రావులు పోలీసు బందోబస్తు మధ్య పొక్లెయిన్లతో నిర్మాణాలను కూలగొట్టారు. ఉట్నూరు సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ.. నాలాను ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణం చేపట్టడం చట్ట విరుద్ధమని, అందుకే ఇంటిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కూల్చివేశామని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా నిర్మించిన ఇంటిని సైతం పంచాయతీ అధికారులు కూల్చివేశారన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు

పాలనాప్రాంగణం: ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, ప్రైవేటు స్థలంలో నిర్మాణాలు ఆయా శాఖల అనుమతి తీసుకున్నాకే చేపట్టాలని పాలనాధికారి రాజర్షిషా స్పష్టం చేశారు. ఇంద్రవెల్లిలో ప్రభుత్వ ఆక్రమిత స్థలంలో నిర్మాణాలను కూల్చివేసినట్లు వివరణ ఇచ్చారు. ముందస్తు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా పరిశీలించి అక్రమ నిర్మాణాలు కూల్చివేశారని తెలిపారు.



ఇంద్రవెల్లి మార్కెట్‌యార్డు ఎదుట నాలాపై నిర్మించిన ఇంటిని కూల్చివేసిన అధికారులు



పాదయాత్రలో ఆదిలాబాద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, హిందూ సంఘాల ప్రతినిధులు

భక్తుల కేలాపూర్ పాదయాత్ర

ఆదిలాబాద్ సాంస్కృతికం, ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం భక్తులు ఆదిలాబాద్ నుంచి కేలాపూర్ దుర్గా మందిర్ వరకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆదిలాబాద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా రాణి సతీజీ మందిరంలో పూజలు నిర్వహించారు. కాషాయ జెండాలు పట్టుకుని భక్తుల కేలాపూర్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం చాంద గ్రామస్థులు భక్తులకు ఫలహారాన్ని అరటి ఆకులో అందించారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు ఉంటుందని ఇలా చేశామన్నారు.

అన్నదాత మురిసేట్టు.. అధికారుల కసరత్తు

● సన్నాలకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:

ఈ వానాకాలం నుంచే సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు పెద్ద మొత్తంలో వీటి సాగుపై దృష్టి సారించారు. గతంతో పోలిస్తే ఈసారి సాగు గణనీయంగా పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా.. అక్రమాలకు తావు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దొడ్డు రకం కేంద్రాలతో పాటు ప్రత్యేకంగా సన్నాలకు విడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ముందుగా నాట్లు వేసిన చోట వరి పొలాలు గొలక దశలో ఉన్నాయి. ఇవి మరో 20 నుంచి 25 రోజుల్లో కోతకు వచ్చే అవకాశాలున్నాయి. మిగతా చోట్ల ఇప్పుడిప్పుడే పొట్ట దశలో ఉండగా ఇవి నెలన్నర నుంచి 50 రోజుల్లో కోతకు రానున్నాయి..

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో అయినకాడికి వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నాల సాగు పెరిగింది. బోనస్ ఇస్తుండటం.. సన్న ధాన్యం ఎక్కువ రానుండటంతో ఇందుకు అనుగుణంగా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించారు. వచ్చే దిగుబడుల ఆధారంగా కేంద్రాల ఏర్పాటు నిర్ణయాధికారం ప్రభుత్వం కలెక్టర్లకు ఇవ్వడంతో స్థానికగా దిగుబడికి అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే దిగుబడి అంచనాకు అనుగుణంగా కేంద్రాల ఏర్పాటుపై ప్రతిపాదనలు తయారు చేశారు.



దండేపల్లి శివారులో సాగవుతున్న సన్నరకం వరి

మద్దతు ఇలా...

- ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ.2,320 'బీ' రకానికి రూ. 2300 ధర ఉంది.
- రూ. 500 బోనస్ కలుపుకుంటే 'ఏ' రకానికి రూ. 2820, 'బీ' రకానికి రూ. 2,800 దక్కనుంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు

మోతీలాల్, అదనపు పాలనాధికారి, మంచిర్యాల

ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ. 500బోనస్ ప్రకటించినందున రైతులకు ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా సన్నరకం కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దొడ్డు రకాలతో పాటు సన్నరకాల కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు అందేలా చూస్తాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాల వారీగా వరి దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)






● జిల్లా	● సన్నాలు	● దొడ్డు	● ప్రతిపాదించిన కేంద్రాలు(దొడ్డు, సన్నం కలిపి)
మంచిర్యాల	2,10,000	1,00,000	326
నిర్మల్	85,000	60,000	260
కుమురం భీం	82,000	15000	34
ఆదిలాబాద్	1500	500	03

తరోడ వాగుపై రూ.4.5 కోట్లతో తాత్కాలిక మార్గం

జైనథ్: తరోడ వాగుపై తాత్కాలిక మార్గం కోసం కేంద్రం రూ.4.50 కోట్లు విడుదల చేసిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన కుంగిన వంతెన పరిసరాలను పరిశీలించారు. నెలన్నరలోగా తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆరు నెలల్లో కొత్త వంతెన పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ :

? ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ కూడలిలో రహదారులపైనే చిరువ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- వినాయక్, వాహనదారుడు**

✔ రహదారిపై వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు ఇస్తాం. వాటిని పక్కకు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- కార్తిక్, టీపీఎస్**

వృద్ధాశ్రమ సేవలు అభినందనీయం

తలమడుగు: నా అనే వారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వయోవృద్ధులకు 20 ఏళ్లుగా సాయి వృద్ధాశ్రమం అందిస్తున్న సేవలు అభినందనీయమని పాలనాధికారి రాజర్షి షా అన్నారు. శనివారం సాయిలింగి వృద్ధాశ్రమంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు గదుల భవనాన్ని ఆయన ప్రారంభించారు. వృద్ధాశ్రమంలో సౌకర్యాలను కల్పిస్తామని ప్రతిపాదనలు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు అశోక్, డీడబ్ల్యూఓ సబిత, జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా,


మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా

సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, శివన్న, పోచ్చన్న, అశోక్, శేవ్వ పోచ్చన్న పాల్గొన్నారు.


బోథ్ : వెంకటస్వామి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు


ఉట్నూరులో మాల సంఘం నేతలు


ఆదిలాబాద్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బలహీన వర్గాల పెన్నిధి కాకా

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) విశేష కృషి చేశారని నేతలు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం కాకా జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్, ఉట్నూరు గ్రామీణం, బోథ్, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే :


జడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి, తదితరులు


ఇంద్రవెల్లి : తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది

క్రైం కార్నర్

భార్యపై హత్యాయత్నం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: విడిపోయి ఉంటున్న భార్యపై పట్టపగలే నడి బజారులో భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. జైజవాన్‌నగర్‌కు చెందిన అభిలాష్ 2020లో మహాలక్ష్మీవాడకు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తి ఈ ఏడాది ఫిబ్రవరిలో న్యాయవాది వద్ద విడాకుల పత్రం రాయించుకున్నారు. అనంతరం ఆమె స్థానిక ఒక సూపర్ మార్కెట్‌లో ఉద్యోగం చేస్తోంది. భర్త అభిలాష్ ఆ సూపర్ మార్కెట్ వద్దకు వచ్చి కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయటంతో అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గేదెల దొంగలు రిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: గేదెలను దొంగిలించిన ముగ్గురు నిందితులను మావల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ విష్ణువర్ధన్ వివరాల మేరకు.. గత నెల 29న కొత్త హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఐలయ్యకు చెందిన అయిదు గేదెలను రాంనగర్‌కు చెందిన షేక్ ఇంతియాజ్, షేక్ మొయిన్‌ఉద్దీన్, కొత్త హౌజింగ్‌బోర్డుకు చెందిన ఇంతియాజ్ ఖాన్‌లు చోరీ చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టగా జ్యుడిషియల్ కస్టడీకి తరలించటానికి న్యాయమూర్తి ఆదేశించారన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: స్థానిక పంజాబ్ కూడలిలో ఆన్‌లైన్ మట్కాను నిర్వహిస్తున్న కొత్త కుమ్మరివాడకు చెందిన కోట పురుషోత్తంను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ ఎస్ఐ అశోక్ తెలిపారు. మరో ఇద్దరు మట్కా నిర్వాహకులు షేక్ నజీర్, షేక్ అజీంలతో కలిసి మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు.

బాధితుడికి చరవాణి అందజేత

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : బాధితుడు పోగొట్టుకున్న చరవాణిని వన్‌టౌన్ సీఐ సునిల్‌కుమార్ శనివారం అందజేశారు. హత్తిగుట్టకు చెందిన గెడం లక్ష్మణ్ ఆగస్టు 25న చరవాణిని పోగొట్టుకున్నాడు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : మండలంలోని జాతీయ రహదారి డొంగ్రగావ్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు గుడిహత్నూర్ ఎస్ఐ ఇమ్రాన్ తెలిపారు. ఇంద్రవెల్లి మండలానికి చెందిన పృథ్వీరాజ్, అక్షయ్, కాంబ్లె కిరణ్ గుడిహత్నూర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా డొంగ్రగావ్ సమీపంలో కారు వెనుక టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


డొంగ్రగావ్‌లో బోల్తాపడిన కారు

సీజ్ చేసిన వాహనాలు మాయం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం కామ్‌గార్‌పూర్ సమీపంలోని పెన్‌గంగ వద్ద శుక్రవారం మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి సంయుక్తంగా దాడులు చేసి సీజ్ చేసిన పలు వాహనాలు మాయమయ్యాయి. ఏడీ రవీందర్, తహసీల్దార్ కె.రఘునాథ్ కలిసి 3 ఆయిల్ ఇంజిన్ బోట్లు, 3 జేసీబీలు, రెండు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, వాటి పని సామగ్రి, పెన్‌గంగలో నిల్వ ఉంచిన 15 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఆర్ఐకి అప్పగించారు. 2 జేసీబీలు, ఒక ఆయిల్ ఇంజిన్ బోటు, ఒక టిప్పర్ రాత్రి మాయమైంది. ఆర్ఐ అశోక్ శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. స్థానిక పంజాబ్ కూడలి వద్ద సీఐ కుణాకర్‌రావు ఆధ్వర్యంలో ఐడీ పార్టీ పోలీసులు రమేష్, నరేష్‌లు వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో బియ్యం రవాణా అవుతున్నట్లు గుర్తించి పట్టుకున్నారు.

విద్యుదాఘతంతో ఎద్దు మృతి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : వాగాయితండాకు చెందిన జాదవ్ హీరామన్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘతంతో మృతి చెందినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఆర్టీసీలో 2019లో సమ్మె సందర్భంగా అమరులైన పలువురు కార్మికులకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చిత్రపటాలున్న ఫ్లెక్సీకి పూలమాల వేసి సమ్మెలో వారు చూపిన స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భీంరావు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సంఘం రీజియన్ అధ్యక్షుడు ఎస్. భీంరావు డిపో కార్యదర్శి ముత్యాల ఆశన్న, వెంకటి, రమేష్, విఠల్, ఖాన్, ఫయీం తదితరులున్నారు.


నివాళులర్పిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, కార్మికులు

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అవసరం

ఎదులాపురం, న్యూస్‌టుడే : వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సమగ్ర చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు లంక రాఘవులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ శాఖ మహాసభల సందర్భంగా పార్టీ పతాకాన్ని శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మల్లేష్, దత్తాత్రి, మంజుల, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నంగారా భవన్‌పై హర్షం

నార్నూర్, న్యూస్‌టుడే : బంజారా కాశీ అయిన మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పౌరాగఢ్‌లో ప్రధాని నరేంద్రమోదీ రూ.500 కోట్లతో బంజారాల నంగారా భవనం ప్రారంభించడం గర్వకారణమని సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని సేవాలాల్ భవనం వద్ద శ్రీసంత్ రామారావు మహరాజ్, ప్రధాని చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బంజారా సేవాసంఘ్ రాష్ట్ర నాయకుడు జాదవ్ రెడ్డినాయక్, ఉత్తమ్ రాఠోడ్, రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీం వర్ధంతికి తరలిరావాలి

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కుమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుమురం భీం మనుమడు సోనేరావుతో కలిసి గోడ ప్రతులను విడుదల చేశారు. మాజీ సర్పంచులు తిరుపతి, గణపతి, కళావతి, మాధవ్, కౌశల్య, నీలాబాయి, అన్నపూర్ణ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : సోయా కొనుగోళ్లల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ మార్కెట్ యార్డులో కొనుగోళ్లను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు భోజనం, నీటి వసతి కల్పించాలన్నారు. ఇచ్చోడలో కొనసాగుతున్న రోడ్డు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.


సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ఇచ్చోడ, న్యూస్‌టుడే : ఇచ్చోడ మండలం జాతీయ రహదారి నుంచి కామగిరి వరకు రూ.1.80 కోట్లతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పనులు ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ కోసం రూ.10 లక్షల నిధులతో పనులను ప్రారంభించారు. గ్రామంలో అందరూ ఐక్యతతో ఉంటే అన్ని పనులు సాధ్యమేనని తెలిపారు.

సామాజిక స్పృహ మేల్కొలిపే చిత్రాలు అవసరం

ఎదులాపురం, న్యూస్‌టుడే : ప్రజల్లో సామాజిక స్పృహను మేల్కొలిపేలా చిత్రాలు అవసరమని జిల్లా అదనపు పాలనాధికారి శ్యామలదేవి అన్నారు. సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సుధీర్‌కుమార్ నిర్మిస్తున్న 'ఓ జీవిత గాథ' చిత్ర నిర్మాణాన్ని ఆమె క్యాంపు కార్యాలయంలో ముహూర్త పూజలు చేసి ప్రారంభించి మాట్లాడారు. ఆదిలాబాద్ అందాలను బయటి ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రేమ, బాధ్యత రెండూ తెలియజెప్పే లఘు చిత్రాన్ని సుధా క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు నిర్మాత సంగెం సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాదులు అమరేందర్‌రెడ్డి, సంజయ్ బైరాగరే, అఫ్రోజ్, దర్శకులు నిఖిలేష్ తొగరి, వంశీ బొమ్మెత, నటీనటులు పాల్గొన్నారు.

యతి నర్సింహానంద సరస్వతిపై ఫిర్యాదు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : యతి నర్సింహానంద సరస్వతి మొహ్మద్ ప్రవక్తపై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ పార్టీలకతీతంగా ముస్లింలు శనివారం ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రతిని సీఐ సునీల్‌కుమార్‌కు అందజేశారు. మొహ్మద్ అయ్యూబ్‌ఖాన్, ఇంతెఖాబ్ ఆలం, ఇఫ్తెఖార్‌ఉద్దీన్, జహీర్ రంజానీ, ఫైజ్‌ఉల్లాఖాన్, అబ్దుల్ ఖదీర్, పత్తి ముజ్జు తదితరులున్నారు.

వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : వన్యప్రాణులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌ఛార్జి ఎఫ్‌ఆర్‌ఓ శిలానంద్ అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా ఉట్నూరులో అటవీశాఖ అధికారులు అటవీశాఖ కార్యాలయం నుంచి ఐబీ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఎస్ఓ గోపాల్ సింగ్, ప్రేంసింగ్, సుదర్శన్, శంకర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ ర్యాంకర్లకు సన్మానం

బోథ్, న్యూస్‌టుడే : డీఎస్సీలో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన బోనగిరి సారిక, రావుల నవిత, ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న రావుల శంకర్‌లను బోథ్ మున్నూరుకాపు మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. అధ్యక్షురాలు మాధవి, సభ్యులు శోభ, భువన, శశికళ, జ్యోత్స్న, పుష్ప, విజయలక్ష్మి, రాజమణి, జ్యోతి, రజిని, అనూష, రాణి, రుష్మిత, అనురాధ, పావని పాల్గొన్నారు.

ముఖరా(కె)ను ఆదర్శంగా తీసుకోవాలి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : ప్రతి పల్లె స్వయం సమృద్ధి బాటలో పయనించాలని పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్ అన్నారు. ఆర్థిక శాఖ ప్రణాళిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖరా(కె) మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షిని సన్మానించి, ప్రశంసా పత్రం అందజేశారు. కమిషన్ ఛైర్మన్ రాజయ్య, కమిషనర్లు దివ్య దేవరాజన్, స్మిత సబర్వాల్, ఎంపీటీసీ సభ్యుడు గాడ్గె సుభాష్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో లక్కారం మాజీ సర్పంచి తిరుపతి, నాయకులు

కాంగ్రెస్‌లో చేరిక

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్కారం మాజీ సర్పంచి తిరుపతి, ఆయన సతీమణి సరస్వతితో పాటు పలువురు భారాస, భాజపా నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కండువాలు కప్పి ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ఖయ్యూం, ఎక్బాల్, చంద్రయ్య, మాజీ సర్పంచులు జగదీష్, కళావతి, రాజేశ్వర్, లాజర్, మహేందర్, ఖలీల్, నందం, రాజమణి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కుటుంబ డిజిటల్ కార్డు జారీ కోసం నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని బల్దియా కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ కోరారు. శనివారం పట్టణంలోని 11వ వార్డులో సర్వే తీరును పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతశాతం పూర్తయింది? ఇంకా ఎన్ని కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్ షాన వాజుర్ రెహ్మాన్, బల్దియా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోస్టు కార్డు ఉద్యమం

భుక్తాపూర్, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను శాసనసభలో తీర్మానించి వాటికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ జిల్లా కేంద్రం బొక్కలగూడ కాలనీకి చెందిన ప్రజలు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద చేరుకుని ముఖ్యమంత్రి, ఎస్సీ వర్గీకరణ కమిటీ, దళిత అభివృద్ధి శాఖ సంచాలకులు, సహాయ సంచాలకులకు తమ విన్నపాలను పోస్టు కార్డు మీద రాసి వాటిని డబ్బాలో వేశారు. సాగర్, నగేష్, సతీష్, కృష్ణ తదితరులు ఉన్నారు.


రాస్తారోకోలో గిరిజనేతరులు

ఏజెన్సీ గిరిజనేతరులకు న్యాయం చేయండి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : స్వాతంత్ర్యం కంటే ముందు నుంచి ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న తమకు న్యాయం చేయాలంటూ గిరిజనేతరులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. గ్రామ పటేల్ మారుతి డొంగ్రె, గిరిజనేతర నాయకులు సంజీవ్ లాహనే, ఎండీ మసూద్, మిర్జా జిలానిబేగ్‌లతో పాటు పలువురు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో స్వాతంత్ర్యం కంటే ముందు నుంచి ఉంటున్న భూములలో ఇళ్లు నిర్మించుకుంటున్నామని, 1/70 చట్టం పేరిట కూల్చివేయడంతో తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో విరమించాలని ఉట్నూరు డీఎస్పీ నాగేందర్ గౌడ్, సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్‌లు గిరిజనేతర నాయకులను విన్నవించినా వినిపించుకోలేదు. రోగిని తీసుకొస్తున్న 108 అంబులెన్స్ రాకపోకలకు దారి ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఉట్నూరు సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. గిరిజనేతరులు సంయమనం పాటించాలని అన్నారు. అనుమతులు తీసుకొని నిర్మించుకోవాలన్నారు. సమస్యను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలి

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : బరిలోకి దిగితే గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం ఖేలో ఇండియా హాకీ కేంద్రం మైదానంలో శనివారం సీనియర్ హాకీ క్రీడాకారుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. 15న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సీనియర్స్ హాకీ పోటీలు నిర్వహించనున్నారని, అందులో సత్తా చాటి విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, సీనియర్ క్రీడాకారులు డేవిడ్ రాజ్, జాదవ్ రవీందర్, శ్రీనివాస్, శేఖర్ ఉన్నారు.

శివాలయంలో షెడ్డు నిర్మాణం

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : బోథ్ మండలం సొనాల శివాలయంలో గ్రామానికి చెందిన అడప శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో శనివారం షెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు. కమిటీ సభ్యులు నరేందర్, గంగారెడ్డి, రాజేశ్వర్, రవి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు సరికావు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఓసీ కులాల మధ్య చిచ్చుపెట్టేలా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటిని ఖండిస్తున్నట్లు రెడ్డి ఐక్యవేదిక యువజన విభాగం ప్రధాన కార్యదర్శి క్యాతం శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులనే తాము పొందుతున్నామని, ఉద్యోగాలు సాధిస్తున్నామని, కులాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.



కష్టాలను ఎదిరిద్దాం.. కన్నీళ్లను తుడిచేద్దాం

● నవరాత్రులు ప్రబోధమిదే





● బతుకులోని మాధుర్యాన్ని గుర్తిద్దాం

ఈటీవీ - ఆదిలాబాద్ :

కలకానిది విలువైనిది బతుకు. కన్నీటిధారలలోనే బలిచేయకు. అగాధమౌజలనిధిలోన ఆణిముత్యమున్నటులే. శోకాలమరుగునదాగి సుఖమున్నదులే. ఏదీ తనంత తానై నీదరికిరాదు. శోధించి సాధించాలి.. అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఆకాశంలో మెరుపు క్షణకాలమే కావచ్చు. ప్రపంచానికి వెలుగునిస్తుంది. విరగకాసిన వృక్షం దెబ్బతగిలినంత మాత్రాన ఫలాలు ఇవ్వటం మరిచిపోదు. జీవితమూ అంతే. చిన్న సమస్యలకే కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడితే ఫలితమేముంటుంది? కష్టాలను ఎదుర్కొంటూ.. కన్నీళ్లను తుడిచేస్తూ ముందుకు సాగితేనే బతుకు సార్థకమవుతుంది. శరన్నవరాత్రులతో పాటు తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరంలోనూ అదే పరమార్థం ఉంది. ఎదిరించి పోరాడాలనే ధీరత్వం ఇమిడి ఉంది. సహజసిద్ధమైన వనరులతో మమేకమై ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆత్మహత్యలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది.


శరన్నవరాత్రులు - బతుకమ్మ సంబరాలు ధీరత్వానికి ప్రతీకలు. తొమ్మిది అవతరాలను పరిశీలిస్తే చెడుపై విజయం సాధించిన హితం వెల్లడవుతుంది. పరిస్థితుల రీత్యా బాలత్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, మహాచండీ, మహాలక్ష్మీ, సరస్వతీ, దుర్గా, మహిషాసుర మర్దని, రాజరాజేశ్వరి దేవి అవతారాలతో బతుకులోని గొప్పదనాన్ని వెల్లడిస్తోంది. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల సారాంశం కష్టాలను దిగమింగి జీవితాన్ని ఆస్వాదించాలని చాటిచెబుతోంది. ఆలోచిస్తే అంతర్లీనంగా కుటుంబ మాధుర్యమేంటో గుర్తుకొస్తుంది. బతుకులోని తీయదనం వెల్లడవుతుంది.

వీరత్వానికి ప్రతీక

జోడేఘాట్ కేంద్రంగా సాగిన కుమురం భీం పోరాటం ధీరత్వానికి ప్రతీక. ఇంద్రవెల్లి వేదికగా సాగిన ఆదివాసీల విముక్తి పోరు మరో జలియన్ వాలాబాగ్‌గా ప్రసిద్ధి పొందింది. ఈ రెండు ఘటనలను పరికించి చూస్తే తమ భావాలను పరస్పరం చర్చలు - పరిష్కార మార్గాలేంటి? అని సమాలోచనలు చేయటమే కాకుండా దండుగా ముందుకు సాగినట్లు చరిత్ర వెల్లడిస్తోంది. ఇప్పుడు దండుగా సాగాల్సిన అవసరం లేదు. సమాజం కోసం కదం తొక్కాల్సిన పని లేదనుకున్నా కనీసం ఎవరి కుటుంబాల గురించి వారు ఆలోచిస్తే ఆత్మహత్య అనే ఆలోచననే రాదు. రైతుల కష్టాలను నెమరేసుకుంటే మనకున్నవి ఇబ్బందులే అని అనిపించవు.



ఆత్మహత్యతో వచ్చేదేమిటి?



అదో ఆనందమైన కుటుంబం. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోంది. కొన్ని నిర్ణయాలతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. స్నేహితులతో చర్చించలేదు. బంధువులను సంప్రదించలేదు. భార్యాపిల్లలు సహా తాను ఆత్మహత్య చేసుకోవటంతో ఆ కుటుంబ ప్రస్థానమే ముగిసిపోయింది. భావిజీవితం కలిగిన పిల్లల బతుకు బలైంది. బతికున్న కుటుంబ సభ్యుల్లో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. అపవాదును తెచ్చిపెట్టింది. కారణాలు వేరైనా ఉమ్మడి జిల్లాలో ఇలాంటివి ఎన్నో చోటుచేసుకోవటం మనసును కలిచివేస్తోంది.

జిల్లాల వారీగా ఆత్మహత్యల వివరాలు..

జిల్లా	2023	2024
ఆదిలాబాద్	260	193
ఆసిఫాబాద్	156	121
నిర్మల్	437	296
మంచిర్యాల	377	350

ఏం చేయాలంటే..

ఉమ్మడి జిల్లాలో నిర్మల్, మంచిర్యాల ప్రాంతాల్లో ఆత్మహత్యల ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌర సమాజం మేల్కోవాలి. జరగకుండా కార్యాచరణను ప్రకటించాలి. గోదావరి, పెన్‌గంగ, ప్రాణహిత జీవనదులే కాదు. సింగరేణి బొగ్గు, తెల్లబంగారమైన పత్తి సహా సహజసిద్ధమైన ప్రకృతి వనరులున్న ఉమ్మడి జిల్లాలో బతుకుదెరువుకు ఉపయుక్తంగా ఉంటుందని వివరిస్తే బలవన్మరణాలు జరగకుండా చూడొచ్చు.





రాగిజావా.. ఆరోగ్యానికి రక్ష!

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:

పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే కాకుండా ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో కేంద్రాల్లో రాగి జావా అందిస్తామని మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించడం వారి ఆరోగ్యం మరింత మెరుగుపడే అవకాశం కలగనుంది.

● అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీకి సన్నాహాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఇప్పటికే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నా.. చాలా మంది చిన్నపిల్లలు పోషకాహార లోపం నుంచి బయటపడలేకపోతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. ఈ క్రమంలో రాగిజావా రక్త హీనతను తగ్గించి ఎముకలు బలంగా మారడానికి ఎంతో మేలు చేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2.50 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఘన రూపం కంటే ద్రవరూప ఆహారంతో త్వరగా జీర్ణం అయి మంచి ఆరోగ్యానికి అవకాశం ఏర్పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వెంటాడుతున్న పోషకాహార లోపం..

చాలా మంది చిన్నారులు పౌష్టికాహారం సరిగా లేక పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక బక్క పలచగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 4,124 అంగన్‌వాడీ కేంద్రాల్లో లోప పోషణ ఉన్న పిల్లలు 5,036 కాగా.. తక్కువ బరువు ఉన్న వారు 16,452 మంది వరకు ఉన్నారు.

పీవీటీజీల కోసం ప్రత్యేక పోషకాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు నిర్వాహకులు నిత్యం గుడ్డుతో భోజనం పెడతారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ (గ్రూప్స్)ల్లో చాలా మంది రక్తహీనత, ఎదుగుదల లోపం తదితర అనేక రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరికి మరింత బలవర్ధకమైన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి పోషణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 291 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ అనుబంధ ఆహారాన్ని అందిస్తున్నారు. దీనిలో జొన్న గట్క, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు, హల్వా, పల్లిపట్టీ, నువ్వుల పట్టీలను పంపిణీ చేస్తున్నారు.

జిల్లాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలు, నమోదైన లబ్ధిదారులు, పిల్లల ఆరోగ్య పరిస్థితి..

జిల్లా	కేంద్రాల సంఖ్య	0-6 ఏళ్ల పిల్లలు	గర్భిణులు	బాలింతలు	అతి తీవ్ర (పోషకాహార లోపం)	తీవ్ర (పోషకాహార లోపం)	అతి తక్కువ (బరువు)	తక్కువ (బరువు)
కుమురంభీం	973	46414	4981	3223	210	737	535	3692
ఆదిలాబాద్	1256	58,082	6832	3756	316	1612	903	5105
మంచిర్యాల	969	48,557	4681	3269	200	785	314	2418
నిర్మల్	926	1,257	6070	4329	254	922	430	3055

గోదారమ్మకు పోచమ్మ నగలు

● ప్రారంభమైన గంగనీళ్ల జాతర



ఆభరణాలను ఎత్తుకొని ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఈవో రమేష్

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఏడాదికోసారి జరిగే 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు శనివారం అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు అడెల్లి గ్రామంలోని సేవాదారుల ఇంటి నుంచి ఆభరణాలను ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ఈవో రమేష్ ఆధ్వర్యంలో బాలాలయంలోని పోచమ్మ తల్లి ఎదుట ఆభరణాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి కడవ, ఆభరణాలతో ఆలయ సిబ్బంది, భక్తులు గోదావరికి పాదయాత్రగా పయనమయ్యారు. పోచమ్మ ఆలయం నుంచి మొదలైన పాదయాత్ర దేవినగర్‌తండా, రాయికనగర్, అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలంలోని మాడెగాం, దిలావర్‌పూర్, బన్సపెల్లి, కంజర్ గ్రామాల మీదుగా సాయంత్రానికి సాంగ్వి సమీపంలోని గోదావరి తీరంలోని అక్కడి పోచమ్మ ఆలయానికి చేరుకుంది. రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం వేకువజామున అమ్మవారి ఆభరణాలను పవిత్ర గోదావరి నీటితో శుద్ధి చేసి వెండి కడవలో నీటిని తీసుకొని తిరిగి అవే గ్రామాల మీదుగా పాదయాత్రగా సాయంత్రానికి అడెల్లికి రానున్నారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో వేలాది మంది కదం తొక్కుతూ గోదావరికి తరలి వెళ్తూ.. గంగనీకు శరణమే.. ఘనమైన పూజలే.. అంటూ భక్తి గీతాలు పాడుతూ గంగమ్మ చెంతకు పయనమయ్యారు. జిల్లా పోలీసు అధికారిణి జానకి షర్మిల ఆదేశాలతో డీఎస్పీ ఎ.గంగారెడ్డి పర్యవేక్షణలో నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ, సారంగాపూర్ ఎస్సై ఎస్.శ్రీకాంత్ ఇతర పోలీసు అధికారులతో కలిసి భారీ బందోబస్తు చేపట్టారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్, ఎంపీడీవో లక్ష్మీకాంత రావు, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఆలయ ఛైర్మన్ చందు, కాంగ్రెస్, భాజపా నాయకులు బాలాలయంలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.



అమ్మవారి ఆభరణాల వెంట పాదయాత్రగా గోదావరికి తరలిన భక్తజనం



ప్రధాన మూర్తిగా నెలకొల్పిన ప్రచండ చండిక విగ్రహం



మాధవేశ్వరి అమ్మవారి నమూనా



మాహోర్‌లోని ఏకవీరా దేవికి ప్రతిరూపంగా..



కశ్మీర్‌లోని సరస్వతీ మాతను గుర్తుచేసేలా..

అమ్మవారి శక్తిపీఠాల ప్రదర్శన

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : అమ్మవారి వివిధ రూపాలకు ప్రతిబింబంగా దేశంలో పలు చోట్ల శక్తిపీఠాలున్నాయి. ఇవి అష్టాదశ శక్తిపీఠాలుగా ప్రసిద్ధి పొందాయి. భక్తులకు వీటన్నింటినీ ఒకేసారి దర్శించుకోవడం వీలుపడదు. అయితే.. శక్తిపీఠాలను కాకపోయినా, అక్కడ కొలువైన అమ్మవారి ప్రతిరూపాలను అన్నింటినీ ఒకేచోట దర్శించుకోవచ్చు. దేవీ శరన్నవరాత్రుల నేపథ్యంలో ఈ అవకాశం చక్కని అనుభూతినిస్తోంది. జిల్లాకేంద్రంలోని శ్రీరాజశ్యామల పీఠం అచ్చంగా ఈ తన్మయత్వాన్ని భక్తులకు అందిస్తోంది. స్థానిక బంగల్‌పేట్ శివారులోని రాజశ్యామలాదేవి ఆలయ ప్రాంగణంలో దశసింహ ఉద్భవమైన ప్రచండ చండిక ప్రతిమను నెలకొల్పారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుప్రసిద్ధమైన శక్తిపీఠాల్లోని అమ్మవారి ప్రతిరూపాలను ఇక్కడ నెలకొల్పారు. నచ్చిన అమ్మవారి చెంత కూర్చొని పూజించొచ్చు. నవరాత్రులు పూర్తయ్యేవరకు నిత్యం అన్నదానం, కుంకుమపూజ, నవకుండాత్మక చండీహోమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

స్పందించిన మానవతావాదులు

● పసిపాప ఆకలి తీర్చేందుకు విరాళాలు



బేల, న్యూస్‌టుడే : పసిపాప ఆకలి తీర్చేందుకు మానవతావాదులు తమ వంతు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఒక్క రోజులోనే 62 మంది స్పందించి రూ. 24,600 ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. రూ. 100 మొదలుకుని రూ. 2 వేల వరకు అందజేశారు. బేల మండలం టెంబ్రీగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుబాయి ప్రసవమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన 23 రోజులకే తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకోసారి పాల డబ్బా కొనుగోలు కోసం 6 కి.మీ దూరం కాలినడకన వాగు దాటి వెళ్తూ కష్టాలు పడుతున్నారు. వారి కష్టాలపై ఈనాడులో 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలోమీటర్ల కాలినడక' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎంతో మంది సాయం చేసేందుకు ముందుకు రావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'ఈనాడు'కు, దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

20 పనులు.. ఉపాధి నిధులు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి కల్పించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేసే పనుల గుర్తింపు, కార్మిక బడ్జెట్ తయారు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు క్షేత్ర స్థాయిలో చేపట్టే పనులపై ముమ్మర కసరత్తు చేపట్టారు. -న్యూస్‌టుడే, మంచిర్యాల గ్రామీణం

ఒక్కో పంచాయతీకి 20కి మించకుండా పనులు గుర్తించి వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పల్లెల్లో ప్రాధాన్యం కలిగిన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా ప్రజల ఆమోదం పొందనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తించిన పనులకు బడ్జెట్‌ను రూపొందించి కేంద్రానికి పంపిస్తారు. అనంతరం కేంద్రం నుంచి ఆదేశాలు రాగానే వచ్చే ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక కార్మిక బడ్జెట్ ఆధారంగానే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టనున్నారు.



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

2025-26 ఉపాధి వార్షిక ప్రణాళిక తయారీ ఇలా

వార్షిక ప్రణాళికపై గ్రామసభల నిర్వహణ : 2 అక్టోబర్ నుంచి 30 నవంబర్ 2024 వరకు

జిల్లా స్థాయి వార్షిక ప్రణాళిక ఆమోదం : 21 జనవరి 2025

రాష్ట్ర స్థాయిలో ఆమోదం : 31 జనవరి 2025

లేబర్ బడ్జెట్ విడుదల : 31 మార్చి 2025

జిల్లాల వారీగా జాబ్‌కార్డులు, కూలీల వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	జాబ్ కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమురంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

2025-26 ఆర్థిక ఏడాదిలో గ్రామాల్లో పేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల ప్రకారమే కార్మిక బడ్జెట్ రూపకల్పన చేసేలా చర్యలు తీసుకుంటాం. నిర్దేశిత లక్ష్యం మేరకు కూలీలకు పనిదినాలు కల్పించి చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తాం. - కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల

వార్షిక బడ్జెట్‌లో చర్చించే అంశాలివే..

పల్లెల్లో పేదలకు కనీసం వంద రోజుల పాటు ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం ద్వారా 2025-26 సం.లో 17 కేటగిరీల్లో 266 రకాల పనులు చేయనున్నారు.

- ప్రధానంగా అసంపూర్తి పనులపై చర్చించాలి.
- జాబ్ కార్డుల అప్‌డేషన్, పౌర సమాచార బోర్డుల తయారీ, సామాజిక తనిఖీలపై చర్చలు
- సామాజిక తనిఖీల కోసం స్వయం సహాయక సంఘాల నుంచి ముగ్గురు చురుకైన మహిళలను గ్రామ రిసోర్సు పర్సన్లుగా నియమించాలి.
- వ్యవసాయ, సహజ వనరులు, జీవనోపాధుల పెంపు పనులపై చర్చించాలి.
- ఇంకుడు గుంతలు, కంపోస్టు షెడ్, ఉద్యాన శాఖ, ప్లాంటేషన్ పనులను పర్యవేక్షణ
- భూగర్భజలాల పెంపుదలను జలదూత్ యాప్‌లో పొందుపర్చాలి.
- బయోగ్యాస్ ప్లాంట్‌పై, అమృత్ సరోవర్ పథకంపై ప్రత్యేకంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మొదటిస్థానం



మొదటిస్థానం కైవసం చేసుకున్న ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్‌జట్టు

మంచిర్యాల క్రీడావిభాగం, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిణులు సత్తాచాటారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో మెరిశారు. మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య నారాయణపేట జిల్లాలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ చాటి పసిడి పతకాన్ని సాధించారు. శనివారం జరిగిన తుదిపోరులో ప్రత్యర్థి కరీంనగర్ జిల్లా జట్టును 14-5 గోల్స్ తేడాతో ఓడించారు. మెరుగైన ఆటతీరును కనబరిచి క్రీడాకారిణులకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందనలు తెలియజేశారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ క్రీడావిభాగం: నారాయణపేటలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14, 17, 19 ఏళ్ల విభాగం ఆయా బరువుల కేటగిరీల్లో 4 పసిడి, 2 రజతాలు, 7 కాంస్య పతకాలు సాధించారు. పసిడి పతకం సాధించిన వారిలో పి.నైతిక, సీహెచ్. సహారా, ఎం.స్పందన, డి.శాలిని ఉన్నారు. భువనేశ్వరి, కె.శ్రీజ రజత పతకాలు సాధించారు. ఆర్.అనూష, ఎస్.నందిత, బి.వైష్ణవి, జె.పావని, ఈశ్వరి, కె.శ్రీవల్లి, పి.సహస్ర కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీగా ఉన్న ఏడు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొడాలి పార్వతి తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశాలకు సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, విద్యాసంవత్సరం ప్రారంభం అనంతరం ఖాళీల వివరాలను వెల్లడిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7తో గడువు ముగియనుందని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.